క్లుప్తంగా

28న ఉచిత వైద్య శిబిరం

బోట్‌క్లబ్: భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న నగరంలోని ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సాలిపేట ఏవీఎన్ ల్యాబ్ (సాయిసుధ హాస్పిటల్ పక్కన) వద్ద నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ అభివృద్ధి సేవా సమాఖ్య అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని నగరంలో పురోహితులు, అర్చకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ వైద్యుల ఉచిత కన్సల్టేషన్‌తో పాటు అవసరమైన వారికి డాక్టర్ల సూచనతో కొన్ని ల్యాబ్ పరీక్షలు ఏవీఎన్ సహకారంతో చేస్తామన్నారు. డాక్టర్ కళిచెనుయుల కృష్ణమూర్తి ట్రస్ట్ సహకారంతో మందులు అందిస్తున్నామన్నారు. దీనికి గాను పురోహితులు, అర్చకులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు భరద్వాజ సేవా సంఘం కార్యవర్గ సభ్యుడు మండలీక వెంకటశాస్త్రి ఫోన్ నంబర్ 95506 11234కు చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

కార్మికులకు పథకాలు అమలు చేయాలి

బోట్‌క్లబ్: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం, తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ జీఓ 26 ప్రకారం పారిశుధ్య సిబ్బందికి, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10 వేల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ. 12 వేల లోపు జీతం కలిగిన వారికి తల్లికి వందనం అమలు చేయవచ్చని అన్నారన్నారు. మంత్రి లోకేష్ ప్రకటన ప్రకారం జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య సిబ్బందికి పథకాలు అమలు చేయడానికి నగరపాలక సంస్థ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న విఘ్నేశ్ ఈశ్వర్

బోట్‌క్లబ్: సరస్వతీ గానసభ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్య కళా మందిరంలో మూడో రోజు బుధవారం చెన్నైకు చెందిన విఘ్నేశ్ ఈశ్వర్ గాత్ర కచేరీ ఆకట్టుకుంది. శ్రీరాగంలో త్యాగరాజు స్వామి పంచరత్న కీర్తన ఎందరో మహానుభావులతో ప్రారంభించారు. ఆమె గాత్ర కచేరీకి వయోలిన్‌పై గాయత్రి శివాని, మృదంగంపై ప్రవీణ్, ఘటంపై సరస్వతుల హనుమంతరావు సహకారం అందించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని సరస్వతీ గానసభ గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి ప్రారంభించారు. సరస్వతీ గానసభ సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ అడ్మిషన్లకు నెట్‌క్వాలిఫై అయిన వారితో భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని గోదావరి లైబ్రేరీ అసోసియేషన్ కార్యదర్శి కె.సాయిబాబు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఉన్న మిగతా యూనివర్సిటీలు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాయని, సాంకేతిక వర్సిటీలో అడ్మిషన్లు భర్తీ చేసి ఉన్నత విద్యకు అవకాశం కల్పించాలన్నారు. ఈ విషయంపై వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న రామాయణ చిత్రాలు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ ఉద్యానంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో రామాయణంలోని శ్రీరామ చరిత్రపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది. రామాయణంలోని ఘట్టాలను ఫ్యాబ్రిక్ (వస్త్రం)పై ఎం.రాజేశ్వరి అద్భుతంగా వేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ అధ్యక్షుడు ప్రసాద నాయకుడు మాట్లాడుతూ 24 వేల శ్లోకాలతో కూడిన రామాయణం మన దేశంలో హిందూ ధర్మ చరిత్ర, సంస్కృతి, నమ్మకాలు, ఆచారాలపై అనితరమైన ప్రభావం కలిగి ఉందన్నారు. అందులో పాత్రలు ఆదర్శ జీవనానికి ప్రామాణికమన్నారు.

గ్రంథాలయాలు నాశనం

బోట్‌క్లబ్: మున్సిపల్ ఆస్తి పన్నులపై అదనంగా రేట్ పేయర్ నుంచి 8 శాతం గ్రంథాలయ పన్ను వసూలు చేయిస్తున్న ప్రభుత్వం వాటిని నేరుగా గ్రంథాలయ సంస్థలకు బదిలీ చేయడం లేదని పౌరసంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం అన్నారు. దీనివల్ల గ్రంథాలయాలు పూర్తిగా నాశనం అవుతున్నాయన్నారు. జిల్లా సంస్థలో 142 ఉద్యోగ ఖాళీలున్నాయన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

సామర్లకోట: బ్యాంకుల నుంచి ఇస్తున్న రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ప్రియంవద అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో బుధవారం వీధి వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కొత్త భవనం... సేవలు బహుళం

- జగన్నాథపురంలో అగ్నిమాపక కేంద్ర నిర్మాణం
- పాత భవనం స్థానంలో నూతన కట్టడం
- అందుబాటులోకి మరిన్ని సదుపాయాలు



బ్రిటీష్ కాలం నాటి అగ్నిమాపక కేంద్రం (ఫైల్)



కొత్తగా అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణం

కాకినాడ క్రైం: అగ్నిమాపక కేంద్ర భవనం కొత్తరూపును సంతరించుకోనుంది. కాకినాడ జగన్నాథపురం చర్చ్ స్క్వేర్ సెంటర్‌లో ఉన్న పాత భవనాన్ని కూలగొట్టి నూతన భవనం నిర్మితమవుతోంది. అధునాతన సదుపాయాలతో సువిశాలంగా రూపుదిద్దుకుంటోంది. 2018 నాటి ప్రతిపాదన దశల వారీగా అమలులోకి వచ్చి మరికొద్ది రోజుల్లో భవనం అందుబాటులోకి రానుంది.

జగన్నాథపురంలోని అగ్నిమాపక కేంద్రం బ్రిటీష్ కాలం నాటిది. 1939లో ప్రారంభించి 1942 నాటికి ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ నిర్మాణానికి రాళ్లు, ఇటుకలు, లైమ్ మార్టర్, చెక్క, ఇనుముతో పాటు కొంత కాంక్రీట్‌ను వినియోగించారు. 83 ఏళ్ల కాలం నాటిది కావడంతో నిత్యం మరమ్మతులకు గురవుతుండగా, పలుమార్లు పెచ్చులూడి పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నూతన నిర్మాణం అనివార్యమైంది. ఈ అగ్నిమాపక కేంద్రానికి ప్రత్యేకత ఉంది. ఎకరం సువిశాల ప్రాంగణంలో నిర్మితమవుతుండగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే పెద్ద కేంద్రం కానుంది. దీనిని జీ ప్లస్ వన్ విధానంలో నిర్మిస్తున్నారు. ఆరు ఫైర్ ఇంజిన్లు నిలిపి ఉండే మూడు గ్యారేజ్‌ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ నిర్మాణంలో కింద మూడు గ్యారేజ్‌లు, ఆఫీస్ రూం, మెస్ క్రూ రూం, స్టోర్ రూం, కంట్రోల్ రూం ఉంటాయి. మొదటి అంతస్తులో ఆఫీసర్ రూం, ఆఫీసర్ యాంటీ రూం, మీటింగ్ హాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ స్టేషన్‌కు నియమితమైన 14 మంది అగ్నిమాపక సిబ్బంది, అధికారులు కొత్త స్టేషన్‌లోనూ కొనసాగుతారు.

రూ.1.15 కోట్ల వ్యయం

ఈ భవనాన్ని రూ.1.15 కోట్లతో నిర్మిస్తున్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు సమకూర్చగా, అందులో స్వల్ప మొత్తం ప్రభుత్వం ఇస్తోంది. హోం డిపార్ట్‌మెంట్‌లో ఫైర్ సర్వీసెస్ వింగ్ పర్యవేక్షణలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ మిటిగేషన్ ఫండ్ (ఎన్‌డీఆర్ఎంఎఫ్) ఆర్థిక తోడ్పాటుతో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ నిర్మాణాన్ని చేపడుతోంది. జిల్లా అగ్నిమాక అధికారి పీవీఎస్ రాజేష్ పర్యవేక్షణలో ఏడీఎఫ్‌వో బంగారపు ఏసుబాబు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

శిక్షణ కేంద్రంగా..

జిల్లాలోనే పెద్ద అగ్నిమాపక కేంద్రంగా జగన్నాథపురం అగ్నిమాపక భవనం అవతరించనున్న నేపథ్యంలో శిక్షణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జోన్-2 జిల్లాలైన ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణ జిల్లాలకు చెందిన సిబ్బందికి అంతర్గత శిక్షణ కేంద్రంగా ఇది సేవలు అందించనుంది. అలాగే సెల్ఫ్ డిఫెన్స్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌గా తీర్చిదిద్దనున్నారు. యుద్ధాలు, విపత్కర వేళల్లో ప్రజలకు తాత్కాలిక శిక్షణ కేంద్రంగా భవనాన్ని వినియోగించనున్నారు.


అధునాతన సదుపాయాలతో..



సేవల్లో నాణ్యత మెరుగుకు నూతన భవన నిర్మాణం చేపడుతున్నాం. సిబ్బంది భద్రతను కూడా పరిగణించాం. బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ భవనం ముస్తాబవుతోంది. అధునాతన సదుపాయాలు ఇందులో ప్రత్యేకత. శిక్షణకు అవసరమయ్యే సమర్థతను సిద్ధం చేస్తున్నాం. పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. నెల రోజుల వ్యవధిలో నూతన భవనం అందుబాటులోకి రానుంది.

– సీపీఎస్ రాజేష్, జిల్లా అగ్నిమాపక అధికారి, కాకినాడ

సేవలకు ఆటంకం లేదు



నూతన భవనం నిర్మితమవుతున్న నేపథ్యంలో తాత్కాలిక షెడ్లలో ఉంటూ అగ్నిమాపక సేవలు అందిస్తున్నాం. ఓ వైపు భవన నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నాం. నిర్మాణ నాణ్యత, పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి డీఎఫ్ఓ ద్వారా ఉన్నత వర్గాలకు నివేదిస్తున్నాం. మరో నెల రోజుల వ్యవధిలో నిర్మాణం పూర్తవుతుంది. ఈ లోపు భవనం లేదని భావించి సేవలు అందించడం లేదన్న ఆలోచన వద్దు. గతంలాగానే రోజులో 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయి.

– బంగారపు ఏసుబాబు, ఏడీఎఫ్ఓ, జగన్నాథపురం అగ్నిమాపక కేంద్రం

అమ్మవు నీవే.. అఖిల జగాలకు..

- దుర్గమ్మ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు



సూర్యారావుపేటలో పుస్తకపాణి అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



దేవాలయం వీధి భీమేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన భానుగుడి ఉషారాజరాజేశ్వరి అమ్మవారు



సంతచెరువు కనకదుర్గమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



కరప శివాలయంలో పుస్తక పాణి అలంకరణలో పర్వతవర్ధినీదేవి



కాకినాడ రూరల్ హ్రీం క్షేత్రంలో దేవీ చంద్రఘంట అలంకరణలో లలితా అమ్మవారు

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి... పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు పుస్తకపాణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దాతల సహకారంతో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చక్రధారి భజన మండలి కీర్తనలు, సకల సిద్ధి విద్యానికేతన్ విద్యార్థులు నృత్య ప్రదర్శన, అనంతరం కన్యకా లలితా మండలి వారిచే పారాయణ, నటరాజ్ కళామందిర్ ఆనెం ప్రసాద్ బృందం కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోరుకొండ జగజ్జనసీరావు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి నవావర్ణార్చన పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం జరిగింది. ఆలయంలో పండితుల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. మాధవనగర్‌లోని కనకదుర్గమ్మ వారు చంద్ర ఘంటిక అలంకరణలో, భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఉషా రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంతచెరువు కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కాకినాడ రూరల్: రూరల్‌లో పండూరు, తిమ్మాపురం, పి.వెంకటాపురం, నేమాం, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల తదితర గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కొవ్వాడ, రమణయ్యపేట ఏపీఎస్పీ, పెనుమర్తి గ్రామాల్లో వారాహి అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు తరలివెళ్లారు. ఏపీఎస్పీ వద్ద హ్రీం క్షేత్రంలో లలితా అమ్మవారు దేవీ చంద్రఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిమ్మాపురంలో భవానీ భక్తులకు సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

కరప మండలంలో..

కరప: మండలంలోని కరప, వలసపాకల, గొర్రిపూడి, కొంగోడు తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకుడు కొంపెల్ల చక్రధర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు, అప్పలస్వామి, నక్కా సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు. కరప శివాలయంలో పర్వతవర్ధినీదేవిని పుస్తకపాణిగా అలంకరించారు. కరప మార్కెట్ యార్డు వద్ద విజయదుర్గా ఆటో యూనియన్, గ్రామస్తులు దుర్గాదేవికి కుంకుమార్చనలు చేశారు. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయంలో అర్చకుడు కాదా సత్యనారాయణ, యండమూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కరప విశ్వాలయంలో అమ్మవారికి అర్చకుడు పెద్దింటి గోపాలకృష్ణ, అనంతాచార్యులు పూజాధికాలు నిర్వహించారు.

అనధికారికంగా మట్టి ఫిల్లింగ్ పనులు



నడకుదురులో అనధికార మట్టి ఫిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు

కరప: అనుమతులు లేకుండా మూడు రోజులుగా సాగుతున్న మట్టి ఫిల్లింగ్ పనులను పంచాయతీ, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వాహనాలను సీజ్ చేస్తామని హడావుడి చేశారు. ఈలోగా అధికార పార్టీ ప్రధాన నేత అనుచరులు ఫోన్ చేయడంతో ఆ వాహనాలను వదిలేసినట్లు తెలియవచ్చింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. కరప మండలం నడకుదురులో ఒక గ్యాస్ కంపెనీ గొడౌన్ నిర్మించడానికి పంట పొలాన్ని మెరక చేసే పని చేపట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అధికార పార్టీ మద్దతుతో మూడు రోజులుగా గ్రావెల్ తరలింపు పనులు జరిగిపోతున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది దీనిపై గ్రామ కార్యదర్శి వారిజకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వోలు కె.గణపతి, వరుణ్, పంచాయతీ సిబ్బందితో కలసి అక్కడికి వెళ్లారు. అనుమతి లేకుండా గ్రావెల్ తోలడం ఏంటి, వాహనాలు సీజ్ చేస్తామన్నారు. గ్రావెల్‌తో మెరక చేసిన ప్రదేశంలో ఉన్న ట్రాక్టర్, గ్రావెల్ తీసుకొచ్చిన మూడు టిప్పర్లను అధికారులు స్వాధీనం చేసుకుని, కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరప ఎస్ఐ టి.సునీత స్పందించి కానిస్టేబుల్‌ను పంపించారు. అక్కడి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ఆ ప్రదేశంలో రెండు గంటల పాటు హైడ్రామా నడిచింది. జనసేన పార్టీకి చెందిన ఒక నాయకుడు ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. దీంతో వాహనాలను వదిలేసినట్లు తెలుస్తుంది. 85 సెంట్ల భూమిలో మెరక చేసే పనిని చేపట్టగా, ఇప్పటికే మూడు వంతులు పూర్తి చేశారు. కార్యదర్శి వారిజను వివరణ కోరగా నోటీసు ఇచ్చామని చెప్పి, మౌనం వహించారు.

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం



పని గంటల పెంపునకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కార్మికుల పని గంటల పెంపును అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించడాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జీపీటీ సమీపంలో మస్తర్ల కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదన్నారు. ఉద్యోగ, కార్మికులపై పనిభారం మోసేందుకే ఈ పని గంటల పెంపు అని, దీనిని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యక్తులకు, బడా పారిశ్రామికవేత్తలకు అదాని, అంబానీలకు లాభం చేకూర్చేందుకు, వారికి కొమ్ముకాస్తూ కార్మికుల శ్రమను దోచిపెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను పెంచుతుందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతుందని అన్నారు. దీనిపై కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేంద్ర, లక్ష్మణ్, వీరబాబు, దుర్గా, మహేశ్వరి, కావయమ్మ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



సమావేశాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస సత్యనారాయణమూర్తి, ఇతర డైరెక్టర్లు

బోట్‌క్లబ్: సహకార రంగంలో తమ సొసైటీ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తుందని ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక సినిమా రోడ్ సూర్య కళామందిరంలో బుధవారం కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన కేసీబీఎస్ ఇటీవలే శతాబ్ది ఉత్సవాలను జరుపుకొందన్నారు. మేనేజర్ టి.నగేష్ సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వే ప్రారంభం

బోట్‌క్లబ్: నగరంలో పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నాక్ష సర్వే బుధవారం నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో జియోగ్రాఫిక్ ఇన్ఫార్మేషన్ సిస్టమ్ (ఏఐ) ఆధారంగా భూదృశ్య చిత్రాలను సేకరించి, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహిస్తున్నారు. ప్రతి ఇల్లు, స్థలం, ఆస్తికి భౌగోళిక గుర్తులు నమోదు చేసి, ఆస్తుల వివరాలు, హద్దులు, విస్తీర్ణం డిజిటల్ పద్ధతిలో నమోదు చేయనున్నారు. ఈ విధానం ద్వారా పారదర్శక ఆస్తి యాజమాన్యం, పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ ఆదాయ వసూళ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింత మెరుగుపడనుందని అధికారులు తెలిపారు. నగరంలోని మొత్తం 50 డివిజన్లకు గాను 40 బృందాలను నియమించారు. ఒక్కో బృందం రోజుకు సగటున 20 సర్వేలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ ప్లానింగ్, అడ్మిన్, వీఆర్వో, సెక్రటరీలు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా డీసీపీ కృష్ణారావు మాట్లాడుతూ సర్వే వల్ల ప్రతి ఆస్తికి ప్రాపర్టీ కార్డు మంజూరు కానుందని, దీంతో బ్యాంకు లోన్ సదుపాయాలు, ఆస్తి విలువల నిర్ధారణ సులభతరం అవుతుందన్నారు.

● అధినేతతో ఆత్మీయంగా...



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన పిఠాపురం కోఆర్డినేటర్ గీతావిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి జమీల్, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు సూర్యనారాయణరాజు, పెద్దాపురం కోఆర్డినేటర్ దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పిఠాపురం కోఆర్డినేటర్ వంగా గీతావిశ్వనాథ్ కలిశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు దంతులూరి సూర్యనారాయణరాజు, పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు తదితరులు కలుసుకున్నారు.



సమీక్షలో పాల్గొన్న నగర వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సమీక్షకు వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు పలు అంశాలపై చర్చించారు.

రక్తదానం చేయండి

బాలాజీచెరువు: ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని, అదే ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం లాంటిదని ఆదిత్య డిగ్రీ కళాశాల ఏడీ డాక్టర్ నాయుడు అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ కె.కరుణ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా రక్తదానం శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడంలో ఆదిత్య విద్యాసంస్థలు ముందు ఉంటాయని, ఇటీవలే విజయవాడలో అవార్డు అందజేశారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసరావు, సురేఖదేవి, కె.నవ్య పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - వికసిత్ భారత్‌పై సదస్సు



పీఆర్‌లో వికసిత్ భారత్ సదస్సులో పాల్గొన్న వక్తలు

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర – వికసిత్ భారత్ 2047పై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సును బుధవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు హాజరై వికసిత్ భారత్‌లో వాణిజ్య విభాగం పాత్ర, దాని ప్రాధాన్యతను వివరించారు. ప్రొఫెసర్ చంద్రప్రసాద్ హాజరై పౌరుల పాత్ర, జీవన ప్రమాణాల అభివృద్ధి, ప్రపంచ నాయకత్వాన్ని వివిధ రంగాల్లో సాధించడం వంటి విషయాలు తెలిపారు. నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ వాణిజ్య, గణాంక శాస్త్రాలు, చిన్న తరహా సంస్థల పాత్ర వివరించారు. కార్యక్రమంలో సదస్సు డైరెక్టర్ కె.లక్ష్మణరావు, బిలాస్‌పూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.వెంకటేశ్వరరావు, ఎం.శరత్, వైస్ ప్రిన్సిపాల్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీనివాసరావు



కరప: స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎస్‌వీ శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన మట్టపర్తి అనుపమకు డీఎల్‌డీఓగా పదోన్నతి లభించగా, ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారిగా బదిలీపై వెళ్లారు. వారం రోజుల కిందట బి.కృష్ణగోపాల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మెడికల్ లీవ్ పెట్టడంతో డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావును ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, ఉపాధి పథక సిబ్బంది, గ్రామ కార్యదర్శులు ఆయన్ని కలసి అభినందనలు తెలిపారు.

ట్రెజరీ బిల్లులు త్వరితగతిన ఆమోదించాలి



ట్రెజరీ అధికారి నవీన్‌చంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టీయూ జిల్లా సభ్యులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ట్రెజరీలో బిల్లులు త్వరితగతిన ఆమోదించాలని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి నవీన్‌చంద్‌కు ఎస్‌టీయూ జిల్లా శాఖ బుధవారం వినతిపత్రం అందజేసింది. జీఓ నంబర్ 01 ప్రకారం ఉపాధ్యాయుల సర్వీస్ ఇంక్రిమెంట్ల మంజూరు విషయంలో సెల్ఫ్ డిక్లరేషన్ పాత పద్ధతిలో ఆటోమెటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్ మంజూరు చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన బదిలీల్లో ఉపాధ్యాయుల వైద్య బిల్లులు మంజూరు చేయాలని, సీఎఫ్ఎంఎస్‌లో ఉపాధ్యాయుల పేరు, పుట్టిన తేదీ సవరణ చేయాలని కోరారు.

పీస్ ఐకాన్-25 అవార్డుల ప్రదానం

బాలాజీచెరువు: గ్లోబల్ పీస్ కల్చర్ అసోసియేషన్ అందజేసే పీస్ ఐకాన్-25 అవార్డులను జేఎన్‌టీయూకేలో వీసీ ప్రసాద్ అందజేశారు. పీస్ ఐకాన్ అధ్యక్షుడు అద్దంకి రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డులు ప్రదానం చేశారు. డాక్టర్ గీసాల శ్రీనివాస్, మానికిరెడ్డి సత్యనారాయణ, విప్పర్తి ఐజక్ న్యూటన్ పండు, చవ్వాకుల సూర్య నగేష్‌బాబు, గెడ్డం శివ, పాడిలం బెన్నబాబులకు అందించారు.